క్లుప్తంగా

చేనేత వస్త్రాలను పరిశీలించిన ఎంపీలు



ఎంపీలకు వినతిపత్రం అందజేస్తున్న ముప్పన వీర్రాజు

సామర్లకోట: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో చేనేతకు ప్రాముఖ్యముందని కాకినాడ ఎంపీ వంగా గీత అన్నారు. పెద్దాపురంలో చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలను కేంద్ర చేనేత సభ్యుడు, కర్నూలు ఎంపీ సంజయ్ కుమార్‌తో కలిసి శుక్రవారం రాత్రి ఆమె పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా పెద్దాపురం వచ్చిన వీరికి ఉమ్మడి చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో తయారైన వస్త్రాలను ఆప్కో మాజీ డైరెక్టరు, రాష్ట్ర చేనేత సంఘ సభ్యుడు ముప్పన వీర్రాజు చూపించారు. వ్యవసాయం తర్వాత చేనేత పరిశ్రమలో పెట్టుబడి పెడతారని వీర్రాజు వివరించారు. చేనేత కార్మికుల పనితీరును సంజయ్ కుమార్ అభినందించారు. చేనేత కార్మిక సంఘం ప్రగతికి ప్రభుత్వం సహకరించాలంటూ ముప్పన వీర్రాజు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరికీ నాణ్యమైన వైద్యం



రోగులకు మందులు అందజేస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు

సామర్లకోట: నాణ్యతతో కూడిన వైద్యాన్ని ప్రతిఒక్కరికీ అందజేయడానికి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినట్టు ఎంపీడీఓ డి శ్రీలలిత అన్నారు. మండలంలోని పీబీ దేవం గ్రామం రెండో సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి సచివాలయ పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు. గ్రామంలో రెండు సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఇప్పటివరకు ఆరోగ్య సర్వే చేయించుకోని వారు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనారోగ్యాన్ని బట్టి రూ.ఐదు లక్షల వరకూ ఆయా కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యాన్ని ఆరోగ్యశ్రీ ద్వారా అందజేస్తున్నట్టు చెప్పారు. గ్రామ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ఎగ్జిబిషన్‌ను అతిథులు తిలకించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కర్రి హరికృష్ణ సత్యారెడ్డి, ఎంఈఓ-2 పి.పుల్లయ్య, ఎంపీటీసీ మలకల సూరిబాబు, సర్పంచ్ నీలపాల సత్యనారాయణ, ఉప సర్పంచ్ మలకల సత్య, సొసైటీ అధ్యక్షుడు మలకల వరహాలబాబు, పంచాయతీ కార్యదర్శి రామ్‌నాథ్ రోగులకు మందుల కిట్లు అందజేశారు. వేట్లపాలెం పీహెచ్‌సీ డాక్టర్లు ప్రశాంత్, శ్రీహిమవతి, వివిధ విభాగాల సిబ్బంది రోగులకు సేవలందించారు.

దుబాయ్ నుంచి కొండెవరానికి మృతదేహం

కొత్తపల్లి: దుబాయ్‌లో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన కొత్తపల్లి మండలం కొండెవరానికి చెందిన కోటా వీరవెంకట సత్యనారాయణ (30) మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి తీసుకువచ్చినట్లు మృతుని బంధువులు తెలిపారు. ఈ నెల 11న సత్యనారాయణ అనుమానాస్పదంగా మృతి చెందినట్లు దుబాయ్ నుంచి ఫోన్ ద్వారా సమాచారం తెలియడంతో అతని బంధువులు కాకినాడ ఎంపీ వంగా గీత దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆమె విదేశాంగ మంత్రితో మాట్లాడి మృతదేహాన్ని స్వగ్రామం తీసుకువచ్చేందుకు కృషి చేశారు. మృతదేహం స్వస్థలానికి తీసుకువచ్చేందుకు కృషి చేసిన ఎంపీ వంగా గీతకు మృతుని కుటుంబ సభ్యులు, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు కొత్తపల్లి పోలీసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని కొత్తమూలపేటకు చెందిన నల్లా నాగత్రిమూర్తులు (55) గురువారం ఉదయం మోటారు సైకిల్‌పై బీచ్ రోడ్డులో పనికి వెళుతుండగా శీలంవారిపాలెం వద్ద అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యాడు. చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు

కాకినాడ క్రైం : కాకినాడలో శుక్రవారం పలు స్కానింగ్ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ ఆదేశాలమేరకు జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐవో) డాక్టర్ కె.రత్నకుమార్ ఈ తనిఖీలు జరిపారు. స్కానింగ్ నిర్వహణ తీరు, రికార్డులు పరిశీలించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని, ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా స్కానింగ్ సెంటర్లకు వచ్చిన వారికి అవగాహన కల్పించారు.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



సామర్లకోట కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సామూహిక సరస్వతీ పూజలు



సామర్లకోట పంచారామ క్షేత్రంలో అమ్మవారికి లక్ష చామంతి పూజ



పాదగయలో సరస్వతీదేవికి విశేషాలంకరణ



పాదగయలో పురుహూతికా అమ్మవారు



తాటిపర్తిలో సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అపర్ణాదేవి అమ్మవారు

సరస్వతీ నమస్తుభ్యం

- సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు
- కిటకిటలాడిన ఆలయాలు
- పంచారామ క్షేత్రంలో హోమం
- విద్యార్థులతో సామూహిక పూజలు

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాలు పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం పాదగయక్షేత్రంలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూలా నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభాసాలు నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తి పీఠానికి అధిష్టాన దేవతైన పురుహూతికా అమ్మవార్లకు విశేషార్చనలు నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యార్థుల సామూహిక పూజలు

పాదగయ క్షేత్రంలోని సరస్వతీదేవి ఆలయంలో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు జరిపించిన పురోహితులు చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, ఆలయ అధికారులు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పిఠాపురంలో పాదగయ క్షేత్రంలో సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు

పిఠాపురంలో మహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవి, దుర్గాడ లలితాదేవి ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

సామర్లకోట: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయాల్లోని అమ్మవార్లను సరస్వతీదేవిగా అలంకరించారు. స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీకుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో వేంచేసి ఉన్న సరస్వతీదేవికి పంచామృతాలతో అభిషేకాలు, లక్ష చామంతి పూలతో పూజలు చేశారు. నోరి కృష్ణారావు మాస్టారు హోమాలు ఏర్పాటు చేశారు. పంచారామ క్షేత్రంలోని అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారిని మధ్యాహ్నం సరస్వతీదేవిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని, స్వామి వారిని దర్శించుకున్నారు. ఈఓ డి నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పూజలు చేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు, దేవస్థాన సిబ్బంది సేవలందించారు. అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయంలోను, సత్తెమ్మతల్లి ఆలయంలోను ప్రత్యేక పూజలు చేశారు. బడేలమ్మ చెరువు వద్ద ఉన్న నవదుర్గ ఆలయంలో ఆలయ ధర్మకర్త విజయదుర్గ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బ్రౌన్‌పేట, భాస్కర్‌నగర్, సాయినగర్‌లోని కనకదుర్గ ఆలయాల్లో, నీలమ్మచెరువు వద్ద సత్తెమ్మ తల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించారు.



పూజలో పాల్గొన్న ఆవాల రాజేశ్వరి, లక్ష్మీనారాయణ దంపతులు

విద్యార్థులతో సామూహిక పూజలు

పట్టణంలోని పెద్ద బజార్ వద్ద ఉన్న కన్యకా పరమేశ్వరీ ఆలయంలో విద్యార్థులతో సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి. వాసవీ కన్యకా పరమేశ్వరీ సంఘ సభ్యులు చిన్నారులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. మండలంలోని వేట్లపాలెం కెనాల్ రోడ్డులో ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. తెల్లవారుజామున అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. వివిధ ప్రాంతాల విద్యార్థులతో సరస్వతీదేవి సామూహిక పూజలు చేశారు. పారిశ్రామికవేత్త గోలి ధర్మరాజు సౌజన్యంతో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందించారు. పీబీ దేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో సరస్వతి పూజలు జరిపారు. సమితి నాయకులు వింజమూరి సుబ్రహ్మణ్యం, విశ్వనాథ్, తోటకూర గంగాధర్ పర్యవేక్షించారు. జి.మేడపాడు, హుస్సేన్‌పురం, ఉండూరు, కాపవరం, పి.వేమవరం, నవర, పవర, పండ్రవాడ, గొంచాల, అచ్చంపేట, పనసపాడు, మాధవపట్నం, వీకే రాయపురం, బోయనపూడి గ్రామాల్లోని కనకదుర్గ ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మూలా నక్షత్ర పూజలు

సామర్లకోట: పాత సామర్లకోటలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత చంద్రశేఖరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి మూలా నక్షత్ర పూజలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. సరస్వతీదేవి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయ పండితులు ఈ పూజలు నిర్వహించారు. రాష్ట్ర అయ్యరక కార్పొరేషన్ చైర్‌పర్సన్ దంపతులు ఆవాల రాజేశ్వరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

అమ్మవార్ల సరస్వతీ అవతారం

పెద్దాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు శుక్రవారం సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల ఈఓలు సీహెచ్ రామ్మోహనరావు, టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు, ఆసాదులు అమ్మవార్లను సరస్వతీ అవతారంలో అలంకరించారు. విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహా సరస్వతి అవతారంలో..

శ్రీభువనేశ్వరి పీఠంలో భువనేశ్వరి అమ్మవారు మహా సరస్వతి అవతారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో పీఠంలో మండపారాధన, అభిషేకాలు, అమ్మవారికి సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీహోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే మండలంలోని ఆనూరు, చదలాడ, పులిమేరు, గోరింట, గుడివాడ, సిరివాడ, చంద్రమాంపల్లి, దివిలి, తిరుపతి గ్రామాల్లో ఆయా ఆలయాల వద్ద సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి.



దుర్గాడ రామలింగేశ్వరస్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు, సరస్వతీ పూజలు



కాండ్రకోటలో విద్యార్థుల సరస్వతీ పూజలు

మరిడమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

పెద్దాపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, కళ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం హోమాలు, సరస్వతీ పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, వీర్రాఘవులు, మండల కన్వీనర్ గోపు మురళి తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న దవులూరి దంపతులు

పేద ప్రజలకు అండ సీఎం జగన్



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు

పెద్దాపురం: అవసరానికి ఆదుకునేవాడు దేవుడైతే.. ప్రజా అవసరాలను తెలుసుకుని వారి పక్షాన నిలబడే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేవుడితో సమానమని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. ×ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..₹ అనే అంశంపై స్థానిక మరిడమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో శుక్రవారం పట్టణ గృహ సారథులు, వలంటీర్లతో సమీక్షా సమావేశం జరిగింది. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ అధ్యక్షత వహించారు. దొరబాబు మాట్లాడుతూ మాట ఇచ్చినట్టుగా ప్రతి సంక్షేమ పథకాన్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. పేద ప్రజలను ఆదుకునేందుకు ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు గతమెన్నడూ అమలు చేయలేదన్నారు. అన్ని వర్గాల వారిని ఆదుకుంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. 2024లో కూడా సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో, వైఎస్సార్ సీపీ ఇచ్చిన ఎన్నికల హామీలును బేరీజు వేసి, ప్రజలకు జరిగిన మంచిని వివరించాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందని వివరించారు. దీనిపై వచ్చే నెలలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమంపై సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు, అగ్రో డైరెక్టర్ సయ్యద్ జానీ, కౌన్సిలర్లు విజ్జపు రాజశేఖర్, త్సలికి సత్యభాస్కర్, ఆరెళ్లి వీర్రాఘవులు, విడదాసరి రాజా, కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, పట్టణ కన్వీనర్ చింతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన గృహ సారథులు

రైల్వే స్టేషన్‌ను పరిశీలించిన ఎంపీ గీత



రైల్వే స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ గీత

సామర్లకోట: కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ శుక్రవారం సామర్లకోట రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆమెకు స్వాగతం పలికారు. స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. రైల్వే స్టేషన్ పరిధిలో కొత్తగా నిర్మిస్తున్న స్టేషన్‌మాస్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపితే, రైల్వే మంత్రిని కలిసి నిధుల కోసం యత్నిస్తానని ఆమె స్టేషన్ మేనేజర్‌కు తెలిపారు. అమృత భారత్ స్కీమ్‌కు సామర్లకోట రైల్వే స్టేషన్ ఎంపికైందని, ఈ పథకంలో స్టేషన్ అవసరాలు తీరుస్తారని రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులతో ఎంపీ మాట్లాడారు. ప్రశాంత్ ఎక్స్‌ప్రెస్‌లో సామర్లకోట చేరుకున్న కర్నూల్ ఎంపీ సంజీవ్‌కుమార్‌కు ఎంపీ గీత స్వాగతం పలికారు. అనంతరం కాకినాడకు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజనీర్లు రవికాంత్, రామసుబ్బా రావు, నారాయణ రావు, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కేవీ గిరి, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిషోర్, ఆర్పీఎఫ్ ఎస్సై ఎన్ రామకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మద్దాలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రాజా

- తామరాడ బస్సు నిలిపివేతపై మండిపాటు
- వాడీవేడిగా పెద్దాపురం మండల సమావేశం

పెద్దాపురం: ఆరు నెలలుగా నిలిపివేసిన కాకినాడ-తామరాడ బస్సు సర్వీస్ పునరుద్ధరిస్తామన్న అధికారులు జాప్యం చేయడంపై పెద్దాపురం మండల సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దాపురం మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఎంపీపీ పెంకే సత్యవతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కాండ్రకోట ఎంపీటీసీ జాగు వీరభద్రరావు, చదలాడ సర్పంచ్ ఒబిలిశెట్టి అబ్బాయిలు మాట్లాడుతూ ఏటిపట్టు గ్రామాల ప్రజలు కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లాలంటే కాకినాడ-తామరాడ బస్సు కీలకమన్నారు. బస్సు రద్దు చేయడాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఉపయోగం లేదని మండిపడ్డారు. వైస్ ఎంపీపీ మిరియాల రాజా మాట్లాడుతూ ప్రజోపయోగంగా ఉన్న ఈ బస్సు సర్వీసును పునరుద్ధరించలేని అధికారులు.. సమావేశాలకు రావడం దండగన్నారు. త్వరలో బస్సు సర్వీసును పునరుద్ధరించకుంటే సమావేశాలను బహిష్కరించి, నిరసనలకు దిగుతామని స్పష్టం చేశారు. త్వరలోనే బస్సు పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు. జెడ్పీటీసీ సూరిబాబు మాట్లాడుతూ ప్రతి సర్పంచ్, ఎంపీటీసీలు అభివృద్ధి పనులు పూర్తి చేసి ప్రజలకు మెచ్చే నాయకుడిలా ఉండాలన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అభివృద్ధే ధ్యేయంగా ప్రజా ప్రతినిధులు పనిచేయాలని ఆకాంక్షించారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేయడంలో ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఎంపీపీ పెంకే సత్యవతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై దృష్టి సారించి, పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలన్నారు. ఆయా శాఖల అధికారులు తమ నివేదికలను వివరించారు. వారిపై సభ్యులు ప్రశ్నల వర్షం కురిపించారు. తహసీల్దార్ వజ్రపు జితేంద్ర, మండల కో-ఆప్షన్ సభ్యులు బిక్కిన శేష వీరకుమారి, హౌసింగ్ చైర్మన్ పీఎస్ రాజశేఖర్, మండల విస్తరణాధికారి మూర్తి, ఎంఈఓ సత్యనారాయణ, వ్యవసాయ శాఖ ఏఓ సంజయ్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష, ఉద్యానాధికారి సుజాత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

లాభాల బాటలో నాగులాపల్లి సొసైటీ



రైతులకు రుణాలు పంపిణీ చేస్తున్న సొసైటీ చైర్మన్ రామచంద్రారెడ్డి

కొత్తపల్లి: మండలంలోని నాగులాపల్లి సొసైటీ లాభాల బాటలో నడుస్తోందని సొసైటీ చైర్మన్ అబ్బిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. రైతు నేస్తం పథకంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో సొసైటీలో రైతులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగులాపల్లి సొసైటీ పరిధిలో 19 మంది రైతులకు రూ.2 కోట్ల రుణాలు అందజేశామన్నారు. ఇప్పటివరకూ రూ.18 కోట్ల రుణాలు రైతులకు అందించామని తెలిపారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జిల్లా కేంద్ర సహకార సంఘం చైర్మన్ ఆకుల వీర్రాజు సహకారంతో సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కాజులూరి నేరేళ్లరెడ్డి, గుర్రా చిన్నబ్బాయి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి జేఎన్‌టీయూకే పీహెచ్‌డీలు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ ఇద్దరికి పీహెచ్‌డీలు జారీ చేస్తున్నట్టు శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. డిజైన్ రీకాన్ఫిగరబుల్ యాంటెన్నాస్ ఫర్ కాగ్నిటివ్ రేడియో అప్లికేషన్స్ అంశంపై కె.విజయచంద్ర సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ ప్రకటించారు. అలాగే జియోస్పేషియల్ టెక్నాలజీ అండ్ సాఫ్ట్ కంప్యూటింగ్ టూల్స్ ఫర్ డీసీజ్ ప్యాటర్న్ డిఫ్యూసన్ అనాలసిస్ అండ్ మ్యాపింగ్ అనే అంశంపై సీహెచ్ యువరాజు రచించిన సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ లభించింది.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో ఐదు లీటర్ల సారాతో గంగు చినతల్లి, కిర్లంపూడి మండలం చిల్లంగిలో ఐదు లీటర్ల సారాతో దయ్యాల సత్తిబాబును అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. సారా కేసులో పరారీలో ఉన్న కిర్లంపూడి మండలం రామచంద్రాపురం గ్రామానికి గిడుతూరి దుర్గను అరెస్టు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్‌సీబీ హెచ్‌సీ వెంకన్నదొర, సిబ్బంది పాల్గొన్నారు.